

ఆర్థికాభివృద్ధికి 'ఉన్నతి'
వంద రోజులు పని పూర్తిచేసుకున్న ఉపాధి కూలీల ఆర్థికాభివృద్ధికి కేంద్రం ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. - 8లో



ఆదర్శం.. ఆ అధికారి
కోదాడ ఆర్డీఓ తన ఇద్దరు కుమారులను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40°/25°

వాతావరణం
ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

రైతులకు సోలార్ ప్లాంట్లు

పీఎం-కుసుమ్ పథకం కింద యూనిట్ల స్థాపన



కట్టంగూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పలకలు

- విద్యుదుత్పత్తితో ఆదాయం పెంచేలా ప్రభుత్వ ప్రణాళిక
- మూడున్నర ఎకరాల పట్టాభూమి ఉన్నవారికి అవకాశం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 874 మంది దరఖాస్తు
- ఈఎండీ చెల్లింపునకు నెలాఖరు వరకు గడువు



రామన్నపేట మండలం బోగారంలో అర్జీదారు భూమిని పరిశీలిస్తున్న టీజీ రెడ్‌కో అధికారులు

హుజూర్‌నగర్ : పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ.. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా పీఎం-కుసుమ్ (ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు టీజీ రెడ్‌కో సంస్థ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించింది. అర్హులైన రైతులు 500 కిలోవాట్ల నుంచి 1 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) రూ.లక్ష చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈఎండీ చెల్లించేందుకు ఈనెల 30 వరకు గడువు ఉంది.

జిల్లా	అర్జీలు	ఈఎండీ చెల్లింపులు	ఎల్ఓఏ ఇచ్చింది
నల్లగొండ	365	91	68
సూర్యాపేట	285	43	24
యాదాద్రి	224	58	31



ఉమ్మడి జిల్లా నుంచి 874 మంది రైతులు
సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 874 మంది రైతులు అర్జీలు పెట్టుకున్నారు. వారిలో ఇప్పటికే 192 మంది రైతులు ఈఎండీ చెల్లించారు. కాగా వారిలో 123 మందికి టీఎస్ రెడ్‌కో అధికారులు ఎల్ఓ (లెటర్ ఆఫ్ అవార్డు) అందజేశారు.

దీర్ఘకాలిక ఆదాయ వనరు
వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను రైతులు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయ్యే ఒక్కో యూనిట్ విద్యుత్‌ను రూ.3.15 చొప్పున విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు విక్రయించడం ద్వారా వారు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు. డిస్కంలతో ఒప్పందం 25ఏళ్ల పాటు కొనసాగుతుండడంతో ఇది దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించనుంది. రైతులు తమ సాగు యోగ్యంకాని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవటం ద్వారా ఆయా భూములు ఆదాయ వనరులుగా మారుతాయి. ఇది గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని అధికారులు అంటున్నారు.

సబ్‌స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరం..
వ్యక్తిగత యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న రైతుల భూములను ఇప్పటికే టీజీ రెడ్‌కో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్ ఉపకేంద్రానికి 5 కిలోమీటర్లలోపు దూరం కలిగిన భూములకు సంబంధించిన దరఖాస్తులకు ఆమోదం లభించనుంది. మూడున్నర ఎకరాల పట్టా భూమి, లేదా పోడుభూమి కలిగిన రైతులను అధికారులు అర్హులుగా గుర్తిస్తున్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలతలు కలిగి, నిబంధనల ప్రకారం ఉన్న స్థలాలకు సంబంధించిన అర్జీలకు అధికారులు ఈనెల 30 వరకు ఈఎండీ చెల్లించే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల సంఖ్య పెరగవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ఆసక్తిగల రైతులు ముందుకు రావాలి



వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తిగల రైతులు ముందుకు రావాలి. నిబంధనల ప్రకారం ఈఎండీ చెల్లించిన దరఖాస్తుదారులు డిస్కంలతో పీపీఏ (విద్యుత్ కొనుగోలు ఒప్పందం) చేసుకోవాల్సి ఉంటుంది. రైతుల అభీష్టం మేరకు ప్లాంట్లు నెలకొల్పేలా సన్నాహాలు చేస్తున్నాం. బ్యాంకులు కూడా రుణాలు అందిస్తాయి.

– ఎం.పాండురంగారావు, మేనేజర్, టీజీ రెడ్‌కో, ఉమ్మడి నల్లగొండ జిల్లా

న్యూస్‌రీల్

దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా
- ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : దొంగతనాల నివారణకు ప్రతిరోజూ తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తూ పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టిందని జిల్లా ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో చాలామంది దూర ప్రాంతాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో ఇంటివద్ద తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలను కోరారు. ఎక్కువ రోజులు ఇళ్లు వదిలి వెళ్ళేవారు ఇరుగుపొరుగు వారికి, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటికి అలారం సిస్టమ్ పెట్టుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని మొబైల్ ఫోన్ ద్వారా చూసుకోవాలని సూచించారు. ఆరుబయట మేడపైన పడుకునే వారు మెడలో ఆభరణాలు ఉంటే జాగ్రత్తగా ఉండాలని, వాకిట్లో ముగ్గులు వేసే సమయంలో ఆభరణాలను చీర పైటతో కవర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా అపరిచితులు అడ్రస్ అడుగుతూ ఏమార్చి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో రెండు నూతన గ్రామ శాఖ కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శులుగా బెజవాడ వినోద్, తాళ్లూరి వెంకటయ్య, సహా కార్యదర్శులుగా కడారి నరేష్, అలవాల రాజేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, సాహెబ్ అలీ, చిలువేరు అంజనేయులు, పిల్లుట్ల కనకయ్య, తాళ్లూరి మట్టయ్య, పెదమల్లయ్య, ఖాజామియా, నాగయ్య పాల్గొన్నారు.

తొలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న తెలంగాణ తొలిదశ ఉద్యమకారులు

సూర్యాపేట అర్బన్ : తెలంగాణ తొలిదశ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని 1969 తొలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ తొలిదశ ఉద్యమకారులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలతో పాటు వారికి గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు, ఉచిత వైద్య సదుపాయంతో పాటు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో తొలి తెలంగాణ ఉద్యమకారులు దేవత్ కిషన్ నాయక్, కక్కిరేణి వెంకన్న, వృన్నం సత్యనారాయణ, హజారి రంగయ్య, కొల్లూరి రామారావు, బందు రుద్రమ్మ, చిత్రం భద్రమ్మ, బత్తుల మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం
మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని పూర్తిచేసి నిత్యకల్యాణం నిర్వహించారు. అదే విధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశం తరువాత మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ ఆదివారం కోదాడ పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు

బోనస్ డబ్బుల కోసం కక్కుర్తి!

- బినామీ రైతుల పేరుతో ధాన్యం అమ్ముతున్న వ్యాపారి
- నారాయణపురం కొనుగోలు కేంద్రంలో అక్రమాలు
- కమీషన్‌కు ఆశపడి సహకరిస్తున్న సెంటర్ నిర్వాహకులు



నారాయణపురం పీఏసీఎస్ కేంద్రంలో రాశులుగా పోసిన వ్యాపారి తీసుకొచ్చిన ధాన్యం

చిలుకూరు: సన్నధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బుల కోసం కక్కుర్తిపడి అక్రమాలకు తెర తీశారు కొందరు. ఈ వ్యవహారం ఆదివారం చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు క్వింటా ధాన్యానికి మద్దతు ధర రూ.2,300తోపాటు బోనస్‌గా రూ.500 కలిపి రూ.2,800 చెల్లిస్తోంది. అయితే ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకే బోనస్ వస్తుంది. కానీ, నారాయణపురం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు ఓ వ్యాపారి వద్ద ధాన్యం కొంటూ నిబంధనలు విరుద్ధంగా వ్యవహిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా..
నారాయణపురం గ్రామానికి చెందిన ఒక వ్యాపారి స్థానిక పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను మచ్చిక చేసుకున్నాడు. దీంతో ఆదివారం తెల్లవారుజామున రెండు లారీల్లో 600కుపైగా ధాన్యం బస్తాలను (70 కేజీల బస్తాలు) తీసుకొచ్చి కేంద్రంలో రాశులుగా పోశాడు. ఆ ధాన్యాన్ని కేంద్రం నిర్వాహకులు కాంటా వేశారు. వారం రోజుల క్రితం కూడా ఇదే వ్యాపారికి చెందిన మరో లారీ ధాన్యాన్ని కాంటా వేయించినట్లుగా తెలిసింది. ఈ విషయం గ్రామ రైతులు, సంఘం చైర్మన్‌కు తెలియడంతో నిబంధనలకు విరుద్ధంగా ఎలా కాంటా వేస్తారని కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. అయితే సదరు వ్యాపారి రైతుల నుంచి తక్కువ రేటుకు కొని మద్దతు ధరతోపాటు బోనస్ వస్తుందని గుట్టుచప్పుడు కాకుండా ఈ కేంద్రంలో అమ్మినట్లు తెలుస్తోంది. అయితే బినామీ రైతుల పాస్ పుస్తకాలు చూపించి అమ్మడం, కేంద్రం నిర్వాహకులు ఆ వ్యాపారి ఇచ్చే కమీషన్‌కు ఆశపడి సహకరిస్తూ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది డిసెంబర్‌లో కూడా మండల పరిధిలోని కొండాపురం ఐకేపీ కేంద్రంలో ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేయడంతో అధికారులు స్పందించి దిగుమతి కోసం మిల్లుకు వెళ్లిన సదరు లారీని వెనక్కి రప్పించారు. ఈ ఘటనపై విచారణ చేసి ఇద్దరిని సస్పెండ్ చేశారు. అయినా అధికారుల తనిఖీలు లేక మళ్లీ నారాయణపురంలో ఇలాంటి వ్యవహారమే కొనసాగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను నిత్యం తనిఖీలు చేయాలని, సదరు కొనుగోలు కేంద్రంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

గుట్ట ఆలయ ఈఓగా వెంకట్రావ్



ఆలయ ఈఓగా నియమితులైన వెంకట్రావ్

యాదగిరిగుట్ట: తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈఓగా ఎస్.వెంకట్రావ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట్రావ్ గతంలో భువనగిరి డీఆర్‌డీఏ పీడీగా పనిచేసి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

మొదటిసారి ఐఏఎస్ అధికారి
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐఏఎస్ అధికారిని నియమించడం ఇదే మొదటిసారి. గతంలో అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్, రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) హోదాలోనే దేవాదాయ శాఖ నుంచి అధికారులను నియమించారు. వెంకట్రావ్ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ డైరెక్టర్, జాయింట్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఈఓగా నియమించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా పద్నాలుగు నెలలుగా ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న భాస్కర్‌రావు బదిలీ అయ్యారు.

యాదగిరీశుడికి సంప్రదాయ పూజలు



శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. గర్భాలయంలోని స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా జరిపించారు. ఆ తరువాత గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయద్వార బంధనం చేశారు.

అందని హమాలీ చార్జీ

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భారంగా హమాలీ ఖర్చు
- ఏటా ఒక్కపైసా విడుదల చేయని ప్రభుత్వం
- ఇప్పటికైనా చెల్లించాలని అన్నదాతల వేడుకోలు



ధాన్యం బస్తాలు లోడ్ వేస్తున్న హమాలీలు

సూర్యాపేట : విత్తనం నాటిన నాటినుంచి పంటను అమ్మేదాకా రైతులకు ఖర్చుల భారం తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను తట్టుకుని ధాన్యం పండించిన రైతులు దాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామన్నా.. కష్టకాలంగానే మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడమే మానేసింది. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాల్లో రైతులు కాంటాలు వేసిన ధాన్యానికి హమాలీ ఖర్చును మొదట్లో ప్రభుత్వమే భరించింది. కానీ కొన్ని సీజన్లుగా హమాలీ ఖర్చు చెల్లించకపోవడంతో రైతులే హమాలీలకు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొనడంతో వారికి ఖర్చు తడిసి మోపడవుతోంది. ఈ యాసంగి సీజన్‌లోనైనా ప్రభుత్వం హమాలీ చార్జి చెల్లిస్తుందేమోనని రైతులు ఆశపడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

లక్ష్యం.. 4.07 లక్షల మెట్రిక్ టన్నులు
జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 286 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4.07లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే గోనెసంచుల్లో వడ్లను నింపి లారీల్లో ఎత్తే హమాలీ ఖర్చును జిల్లాలో రైతులే భరిస్తున్నారు. ఈ సెంటర్లను నెలకొల్పిన తొలినాళ్లలో 2014, 2015 సీజన్లలో ప్రభుత్వం చెల్లించింది. మొదటగా రైతులు ఇస్తే వడ్ల బిల్లులు పడే సమయంలోనే హమాలీల డబ్బులను క్వింటాకు రూ.32 చొప్పునప్రభుత్వం చెల్లించింది. ప్రస్తుతం అధికారులు ఈ లెక్కలు ప్రభుత్వానికి పంపుతున్నా.. డబ్బులు అందడం లేదు.

కొన్న ధాన్యం.. హమాలీ చార్జీల వివరాలు ఇలా..

సీజన్	కొన్నధాన్యం (లక్షల మెట్రిక్ టన్నుల్లో)	హమాలీ ఖర్చు (రూ.కోట్లలో..)
వానాకాలం(2024-25)	2.40	12
వానాకాలం(2023-24)	2.80	14
యాసంగి(2023-24)	3.30	16.5
వానాకాలం(2022-23)	3.10	15.50
యాసంగి(2022-23)	3.80	19

ఏటేటా రైతులపై భారం
వడ్ల కాంటా సమయంలో రైతులకు హమాలీల ఖర్చు విపరీతంగా ఉంటుంది. మొదట్లో క్వింటాకు రూ.30లకు వేసిన హమాలీలు సీజన్ సీజన్‌కు పెంచుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొన్నిచోట్ల క్వింటాకు రూ.50ల వరకు వసూలు చేస్తున్నారు. ఇదే కాకుండా ఉల్వాల పేరుతో వడ్లను బట్టి అదనంగా మరో రూ.500 నుంచి రూ.3వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఎకరం సాగు చేసిన వారికి హమాలీ ఖర్చు మొత్తంగా రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు అవుతుందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 4.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా.. ఈ లెక్కన హమాలీల ఖర్చు రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు రైతులపై భారం పడుతోంది. ఇలా ప్రతి సీజన్‌లోనూ రూ.20 కోట్ల వరకు హమాలీ చార్జీల రూపంలో రైతులపై ఆర్థిక భారం పడుతోంది.

హమాలీ డబ్బులు చెల్లించాలి



కాంటాలు వేసిన వడ్లకు హమాలీ ఖర్చు భారంగా మారింది. ఏటేటా హమాలీ కూలి పెంచుతున్నారు. ప్రభుత్వం ఈ డబ్బులను రైతుల అకౌంట్లలో వేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సీజన్‌లో రూ.7నుంచి రూ.8వేల వరకు ఈ హమాలీలకే ఇవ్వాల్సి వస్తుంది.

– బండి సత్యనారాయణ, కొత్తగూడెం, తుంగతుర్తి మండలం

నేరుగా హమాలీలకే ఇవ్వాలి



ప్రభుత్వం మొదట్లో హమాలీ ఖర్చులను రైతుల అకౌంట్లలో జమచేసింది. ఈ డబ్బులు ప్రస్తుతం ఇవ్వడం లేదు. రైతులు కాకుండా నేరుగా హమాలీలకు ఇస్తే బాగుంటుంది. హమాలీ చార్జితో రైతులు కొంత ఇబ్బంది పడుతున్నారు.

– బోళ్ల లక్ష్మయ్య, అనంతారం

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

- ఈ వేసవి సెలవుల్లోనే అందించేందుకు కార్యాచరణ
- నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా తర్ఫీదు
- ఇప్పటికే రిసోర్స్‌పర్సన్ల ఎంపిక అర్జీల స్వీకరణ
- నేడు ఎంపికైన వారి జాబితా విడుదల



సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యనందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యార్థులు చదువులో వెనుకబడి ఉన్నట్టు జాతీయ స్థాయి సర్వేల్లో సైతం వెల్లడైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యనందించడమే కాకుండా ఉపాధ్యాయుల్లో బోధన శక్తి సామర్థ్యాలను పెంచేందుకు వేసవి సెలవుల్లో వృత్యంతర శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర విద్యా శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. శిక్షణ ఇచ్చేందుకు రిసోర్స్ పర్సన్లను ఈ నెల 30లోగా ఎంపిక చేసి ఎస్‌సీఈఆర్టీకి జాబితా పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఈ నెల 24 వరకు రిసోర్స్ పర్సన్ల ఎంపికకు ఉపాధ్యాయులు దరఖాస్తులు సమర్పించారు. ఈ నెల 28వ తేదీ (సోమవారం) సెలక్ట్ అయిన ఉపాధ్యాయుల వివరాలను ప్రకటించనున్నారు.

రిసోర్స్ పర్సన్ల ఎంపిక ఇలా..
ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్లను జిల్లా కలెక్టర్, డీఈఓ, తదితర అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు, డెమోల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. ప్రతి మండలం నుంచి ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు ఎస్‌జీటీల చొప్పున, జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్లను రిసోర్స్ పర్సన్‌లుగా ఎంపిక చేస్తారు. ఈ నెలాఖరు వరకు వీరి నియామకం పూర్తిచేసి మే నెలలో శిక్షణ ప్రారంభిస్తారు.

మండల ప్రాథమిక స్థాయిలో..
మండల స్థాయిలో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఎనిమిది మందిని ఎంపిక చేయనున్నారు. ఇందులో తెలుగుకు ఇద్దరు, పరిసరాల విజ్ఞానం(ఈవీఎస్) 2, ఇంగ్లిష్ 2, మ్యాథ్స్ 2 చొప్పున రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయనున్నారు.

జిల్లా స్థాయి ప్రాథమిక పాఠశాలల్లో..
జిల్లా స్థాయి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కోసం 10 మందిని ఎంపిక చేయనున్నారు. ఇందులో తెలుగుకు ఇద్దరు, పరిసరాల విజ్ఞానం ఇద్దరు, ఇంగ్లిష్ ఇద్దరు, మ్యాథ్స్ 2, స్పెషల్ ఎడ్యుకేషన్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తారు. అలాగే ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు శిక్షణ కోసం నలుగురిని ఎంపిక చేయనున్నారు. ఇందులో ఉర్దూ 2, మ్యాథ్స్ 1, పరిసరాల విజ్ఞానానికి ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తారు.

జిల్లా స్థాయి ఉన్నత పాఠశాలల్లో..
జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కోసం 36మందిని ఎంపిక చేయనున్నారు. ఇందులో తెలుగు నాలుగు, హిందీ 4, ఇంగ్లిష్ 4, మ్యాథ్స్ 4, ఫిజికల్ సైన్స్ నాలుగు, బయో సైన్స్ నాలుగు, సోషల్ నాలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్ నాలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్ నలుగురి చొప్పున ఎంపిక చేయనున్నారు. ఇక, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలల శిక్షణ కోసం 10 మందిని ఎంపిక చేయనున్నారు. ఉర్దూ రెండు, మ్యాథ్స్ రెండు, ఫిజికల్ సైన్స్ ఇద్దరు, బయో సైన్స్ ఇద్దరు, సోషల్ సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు జిల్లా స్థాయిలో శిక్షణ కోసం ఎంపిక చేయనున్నారు. వీరి ద్వారా మొత్తం ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారు.

నాణ్యమైన బోధనకు దోహదం



ఉపాధ్యాయులకు వచ్చే నెలలో రిసోర్స్ పర్సన్లచే ఇచ్చే శిక్షణ నాణ్యమైన బోధన అందించేందుకు దోహదపడుతుంది. వచ్చే నెలలో మండల, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నాం. ఈ నెల 30లోపు రిసోర్స్‌పర్సన్‌ల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


జ్యోతి (ఫైల్)

మునగాల: లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల శివారులో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పొన్నగండ్ల జ్యోతి(49) మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్లింది. తిరిగి శనివారం రాత్రి తన అల్లుడు గాదె నరేందర్‌రెడ్డి కారులో స్వగ్రామానికి బయల్దేరింది. మార్గమధ్యలో అర్ధరాత్రి సమయంలో మునగాల శివారులోని కెనరా బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన ధాన్యం లోడుతో ఆగి ఉన్న లారీని వీరి కారు ఢీకొట్టింది. కారు ముందు సీటులో కూర్చున్న జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీస్ స్టేషన్ హౌజ్ అధికారి వెంకటరత్నం తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య


జనార్దన్ (ఫైల్)

అర్వపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి భార్యతో గొడవపడి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగింది. అర్వపల్లి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన నవ్య, సూర్యాపేట మండలం గాంధీనగర్‌కు చెందిన జక్కలి జనార్దన్(30) తొమ్మిదేళ్ల ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. జనార్దన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన జనార్దన్ తరచూ భార్యను వేధిస్తూ ఉండేవాడు. నవ్య ఉగాది పండుగకు తన పిల్లలతో కలిసి తల్లిగారి ఊరైన కొమ్మాలకు వచ్చింది. అప్పటి నుంచి తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. మూడు రోజుల కిందట జనార్దన్ కూడా అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో మద్యం తాగుతూ భార్యను వేధించడం మొదలుపెట్టాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటాక జనార్దన్ తన అత్తగారి ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ.. ఒకరికి గాయాలు


తోపుడు బండ్ల పైకి దూసుకొచ్చిన కారు

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై అర్వపల్లిలో ఆదివారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ వైపు నుంచి రెండు కార్లు సూర్యాపేట వైపు వెళ్తున్నాయి. అర్వపల్లిలోని వైజంక్షన్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో ముందు వెళ్తున్న కారు వైజంక్షన్ వద్ద ఓ టీస్టాల్ బోర్డుకు తగిలి తోపుడుబండ్ల పైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో అక్కడే నిలిపి ఉన్న కర్కాని రమేష్‌కు చెందిన బైక్ ధ్వంసమైంది. తోపుడు బండ్ల వద్ద ఉన్న మహిళలు సావిత్రి, సువర్ణ అక్కడి నుంచి పరుగు తీసి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు కూడా ధ్వంసమయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు కార్లను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ముందు కారు నడుపుతున్న ఆరోగ్యరెడ్డి గాయపడగా.. అతడిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికాభివృద్ధికి ‘ఉన్నతి’

- ఉపాధి కూలీలకు అదనపు ఆదాయం చేకూర్చేలా కొత్త పథకం
- కూలి పనులు లేని సమయంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ
- ఇప్పటికే నాలుగు మండలాల్లో పూర్తి
- పోచంపల్లి మండలం జలాల్‌పురంలో కొనసాగుతున్న శిక్షణ
- శిక్షణ అనంతరం యూనిట్ల ఏర్పాటుకూ రుణాలు



అగర్‌బత్తీల తయారీలో శిక్షణ పొందుతున్న ఉపాధి కూలీలు

భూదాన్‌పోచంపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు అదనపు ఆదాయం వచ్చేలా కేంద్ర ప్రభుత్వం ‘ఉన్నతి’ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కూలీలకు స్వల్పకాలిక స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే పలు మండలాల్లో శిక్షణ ఇచ్చారు. తాజాగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం, భీమనపల్లి, మెహర్‌నగర్ గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పని దినాలను పూర్తి చేసుకొన్న 35 మంది కూలీలను గుర్తించారు. వీరికి జలాల్‌పురంలోని రైతువేదిక భవనంలో ఎస్‌బీఐ ఆర్థిక సహకారంతో, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో 12 రోజుల పాటు అగర్‌బత్తీలు, దూప్‌స్టిక్, కుంకుమ తయారీలో శిక్షణ ఇస్తున్నారు.

యూనిట్ల స్థాపనకు సహకారం..

విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు శిక్షణ కాలంలో రోజుకు రూ.300 వేతనం, భోజన వసతి, ఉచితంగా యూనిఫామ్, మెటీరియల్స్, సర్టిఫికెట్లు అందజేస్తారు. తదనంతరం స్వయం ఉపాధి యూనిట్‌లను ఏర్పాటుకు స్త్రీశక్తి లేదా బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం ద్వారా ముద్ర రుణాలు అందించేందుకు కార్యాచరణ రూపొందించారు. దాంతో సొంతూరిలోనే స్వయంగా యూనిట్లను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందే వీలుంది. అంతేకాక వీరు తయారు చేసిన ఉత్పత్తులను తామే స్వయంగా లోకల్ మార్కెట్‌లో విక్రయించుకోవచ్చు. లేదంటే ఉత్పత్తులను విక్రయానికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తారు.

యాదాద్రి జిల్లాలో ఇప్పటివరకు..

ఉపాధిహామీ పథకంలో ఈ 2024–25 సంవత్సరానికి గాను ఉన్నతి పథకం ద్వారా జిల్లాలో 175 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాంతో నారాయణపురం మండలం జనగాంలో జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇచ్చారు. వలిగొండ మండలం రెడ్లరేపాక, మోటకొండూర్ మండలం మాటూర్, రామన్నపేటలో మాత్రం ఉపాధి కూలీలకు డెయిరీ, వర్మీ కంపోస్టులో శిక్షణ అందించారు. ఇలా కూలీలకు డెయిరీ, అగర్‌బత్తీలు, జ్యూట్‌బ్యాగుల తయారీలో శిక్షణ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు వరం



ఉన్నతి పథకం ఉపాధి కూలీలకు వరం లాంటిది. అదనపు ఆదాయం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అమలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే కొందరికి శిక్షణ ఇచ్చాం. పోచంపల్లిలో అగర్‌బత్తీల తయారీలో శిక్షణ ఇస్తున్నాం. యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందజేస్తాం.

– కేపీ రాజు, జాబ్స్ జిల్లా మేనేజర్

యూనిట్ ఏర్పాటు చేసుకుంటా..



నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. గ్రామంలో ఉపాధిహామీలో వందరోజులు పనిదినాలు పూర్తి చేశాను. దాంతో మాకు అగర్‌బత్తీల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత గ్రామంలో స్వయంగా యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటాను.

– ఎద్దకాడి స్వప్న, భీమనపల్లి గ్రామం

అదనపు ఆదాయం వస్తుంది



నేను పదో తరగతి వరకు చదివా. గ్రామంలో ఉపాధి పనులకు వెళ్తాం. అదనపు ఆదాయం పొందేలా అగర్‌బత్తీలు, దూప్‌స్టిక్, కుంకుమ తయారీలో శిక్షణ ఇస్తున్నారు. బ్యాంకు ద్వారా లోన్ తీసుకుని యూనిట్‌ను విస్తరిస్తూ మరో పదిమందికి ఉపాధి కల్పిస్తాను.

– గుండ్ల భవానీ, జలాల్‌పురం

ఖాళీ సమయంలో ఆదాయం



కూలి పనులులేని ఖాళీ సమయంలో అగర్‌బత్తీలు, దూప్‌స్టిక్, కుంకుమ తయారీ చేసి విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చు. బ్యాంక్ లోన్ ఇస్తామంటున్నారు. తాము తయారుచేసిన ప్రొడక్ట్ విక్రయానికి అవకాశం కల్పిస్తామనడం చాలా ఆనందంగా ఉంది.

– రాసనూరి శైలజ, మెహర్‌నగర్

హోరాహోరీగా ఎద్దుల పందేలు


బండ లాగుతున్న ఎద్దులు

మఠంపల్లి: మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రెండో రోజైన ఆదివారం సాయంత్రం ఆరు పండ్ల విభాగంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు కొనసాగాయి. అదేవిధంగా శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు జరిగిన నాలుగు పండ్ల విభాగంలో గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి గిత్తలు ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. రెండో బహుమతిని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా తుర్లపాడుకు చెందిన మనివిరెడ్డి ఎడ్ల జత కైవసం చేసుకున్నాయి. మూడో బహుమతి కృష్ణా జిల్లా మల్లపల్లికి చెందిన అక్కినేని సాన్విచౌదరి గిత్తలు గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతితో పాటు షీల్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి, నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, టీఆర్‌బాలశౌరిరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, గాదె లూర్థుమారెడ్డి, పవన్‌రెడ్డి, బాలరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో ప్రముఖుల పూజలు


ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజుకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం


బంగారు పతకంతో కొణతం గమన్‌రెడ్డి

నేరేడుచర్ల: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం, ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్–2025లో నేరేడుచర్ల పట్టణానికి చెందిన కొణతం గమన్‌రెడ్డి పాల్గొని బంగారు పతకం సాధించాడు. గమన్‌రెడ్డి హైదరాబాద్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్ స్కాలర్స్ అకాడమీలో ఐదో తరగతి చదువుతున్నాడు. గమన్‌రెడ్డి కోచ్ సుబ్బారావు శిక్షణలో ఎస్ఐటీఎస్ సంస్థలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడని అతడి తాత, నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గమన్‌రెడ్డి ఐదు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు సాధించాడని పేర్కొన్నారు. గమన్‌రెడ్డి బంగారు పతకం సాధించడంతో అతడి తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్‌రెడ్డి–శోభన, నాయనమ్మ కొణతం విజయలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.



ఆర్టీసీ బస్ టిక్కెట్‌పై తప్పుడు తేదీ, సమయం ముద్రణ



తప్పుడు తేదీ, సమయంతో ఉన్న బస్ టిక్కెట్

మోత్కూరు: ఆర్టీసీ బస్సులో జారీ చేసే టిక్కెట్లపై తప్పుడు తేదీ, సమయం ముద్రించడంతో ప్రయాణికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. మోత్కూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూదగాని యాదగిరి తన భార్యతో కలిసి ఆదివారం సాయంత్రం 4గంటలకు హైదరాబాద్‌లోని ఉప్పల్ ఎక్స్ రోడ్డు వద్ద తొర్రూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు(టీఎస్ 03 జెడ్ 0457) ఎక్కారు. అక్కడి నుంచి మోత్కూరు వరకు రెండు బస్ టిక్కెట్లు తీసుకున్నారు. ఒక్కోటి రూ.190తో ముద్రించిన టిక్కెట్‌ను డ్రైవర్ యాదగిరికి ఇవ్వగా.. దానిపై తేది: 02–10–68, సమయం: 8.37నిమిషాలుగా ముద్రించి ఉండటం గమనించి డ్రైవర్‌ను అడగగా.. టిక్కెట్లు ఇచ్చే మిషన్‌లో అలాగే వస్తుందని డ్రైవర్ యాదగిరికి సమాధానం ఇచ్చాడు. తాము ప్రయాణించిన బస్సు ఏదైనా ఊహించని ప్రమాదానికి గురైతే తమకు ఎలా ఆధారం అని, టిక్కెట్‌పై తేదీ, సమయం తప్పుగా ముద్రిస్తే ఎలా అని యాదగిరి అంటున్నారు.

ఆదర్శం.. ఆ అధికారి

- తన కుమారులను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిస్తున్న కోదాడ ఆర్డీఓ
- ఇంటర్ ఫలితాల్లో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు


ఇద్దరు కుమారులతో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

కోదాడ: కోదాడ ఆర్డీఓ తన ఇద్దరు కుమారులను ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వారు కూడా ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 95 శాతానికి పైగా మార్కులు సాధించి తండ్రికి తగ్గ తనయులు అనిపించారు. కోదాడ ఆర్డీఓగా సూర్యనారాయణ రెండు సంవత్సరాల క్రితం ఖమ్మం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఆయన పెద్దకుమారుడు షణ్ముఖనాయుడు, చిన్నకుమారుడు యోషిత్‌నాయుడిని కోదాడలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాడు. వారిద్దరూ ఆర్ట్స్ విభాగానికి చెందిన హెచ్‌ఈసీ గ్రూప్ తీసుకున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పెద్ద కుమారుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 960 మార్కులు సాధించగా, చిన్న కుమారుడు ఫస్టియర్‌లో 500 మార్కులకు 490 మార్కులు సాధించి జిల్లా టాపర్స్‌గా నిలిచారు.

డిగ్రీ కూడా ప్రభుత్వ కాలేజీలోనే..



ఇంటర్ హెచ్‌ఈసీలో 960 మార్కులను సాధించడం ఆనందంగా ఉంది. డిగ్రీ కూడా ప్రభుత్వ కళాశాలలోనే చదువుతా. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా నా చదువును కొనసాగిస్తాను. మానాన్నే నాకు ఆదర్శం. ఆయన మాట నిలబెడతా.

– షణ్ముఖనాయుడు

ఉన్నత ఉద్యోగమే లక్ష్యం



ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం. ఇంటర్ ఫస్టియర్‌లో 500కు 490 మార్కులను సాధించడం ఆనందంగా ఉంది. మానాన్న చూపిన బాటలో నడిచి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మా అన్న కన్నా ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేస్తా.

– యోషిత్‌నాయుడు

కాంగ్రెస్, కమ్యూనిస్టులు పోటీచేస్తే ప్రతిపక్షాలు ఉండవు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

మునుగోడు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలల్లో కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలిసి పోటీ చేస్తే మునుగోడు నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు కనుమరుగు కావడం ఖాయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంకు ఆదివారం మునుగోడులో నిర్వహించిన అభినందన సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా మునుగోడు, కొత్తగూడెం స్థానాలను కాంగ్రెస్ పార్టీ సీపీఐకి కేటాయించిదన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండగా.. బీజేపీతో ఉన్న తాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కోరిక మేరకు కాంగ్రెస్‌లో చేరడంతో తనకు మునుగోడు టికెట్ ఇచ్చిందన్నారు. ఆ సమయంలో సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా బరిలో ఉన్న నెల్లికంటి సత్యంకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని, అలాగే తనకు మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని.. ఈ మేరకు సత్యంకు ఎమ్మెల్సీ ఇచ్చిందన్నారు. ఈ ప్రాంతం పట్ల అవగాహన కలిగిన సత్యం ఎమ్మెల్సీగా ఎన్నికకావడం ఆనందంగా ఉందన్నారు. తామిద్దరం కలిసి మునుగోడుని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడుని పూర్తిగా విస్మరించినదని, దీంతో నేటికీ ఈ ప్రాంతంలో సాగునీరు సౌకర్యం కరువైందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన వారికే కాంగ్రెస్ హయాంలో పదవులు ఇచ్చారన్నారు. చర్లగూడెం, కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయిర్ పనులను పూర్తిచేయించి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ పదవులు ఆశించలేదని, నిత్యం ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాదయాత్రలు, ఆందోళనలు చేస్తూ ప్రజల కోసమే పనిచేశానన్నారు. ఎమ్మెల్సీ పదవిని ఒక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో కలిసి మునుగోడును రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం సత్యంను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, గుర్జ రామచంద్రం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడింది

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీపీఐకి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. అభినందన సభలో వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సీపీఐకి ఎమ్మెల్సీ పదవితోపాటు రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి మునుగోడు అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఐక్యంగా పనిచేస్తూ వెనుకబడిన మునుగోడు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అన్నారు.

- రైతన్నకు వాన కష్టాలు


భూదాన్‌పోచంపల్లి: ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి శివారెడ్డిగూడెంలో ధాన్యం కుప్పల మధ్యన నిలిచిన వర్షపు నీరు


చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న వరి ధాన్యం

ఏడాదిన్నరగా ఎదురుచూపులు

- ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలకు పాలకవర్గాలు లేక కుంటుపడుతున్న అభివృద్ధి
- ప్రముఖ ఆలయాల్లో ఈఓలు, సిబ్బందితో కష్టతరంగా నిర్వహణ


చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలకు ఏడాదిన్నరగా పాలకవర్గాలు లేక ఆలయాల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతోంది. ఏటా వివిధ మాసాల్లో నిర్వహించే ఉత్సవాల్లో ప్రముఖ దేవాలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఈఓలు, సిబ్బందితో దేవాలయాలను నిర్వహించడం కష్టంగా మారుతోంది. ఒక్కో ఈఓ మూడు, నాలుగు దేవాలయాలకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో పూర్తిగా ఒకే ఆలయంపై దృష్టిపెట్టలేకపోతున్నారు. పండుగలు, విశేష రోజుల్లో ఆలయానికి వచ్చే భక్తులకు సరైన సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాల్లో భక్తులు వేసిన కానుకలు, హుండీ ఆదాయంపై ఉన్న శ్రద్ధ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై దేవాదాయ శాఖ దృష్టి సారించకపోవడంతో భక్తులు మండిపడుతున్నారు. ఏడాదిన్నర క్రితం గత ప్రభుత్వ పాలనలో ఆలయాల పాలకవర్గం పదవీకాలం ముగిసిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ట్రస్ట్ బోర్డు ఏర్పాటవుతుందని ఎదురుచూశారు. ఇంతలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల అనంతరం ట్రస్ట్ బోర్డు ఏర్పాటు నోటిఫికేషన్ రావడంలో జాప్యమైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని దేవాలయాల్లో పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చినా అవి మధ్యలోనే ఆగిపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతోంది. ఇప్పటి వరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు సంబంధిత అధికారులు, దేవాదాయ శాఖ మంత్రి చొరవ తీసుకుని వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 83 ఆలయాల పాలకవర్గాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో 40 ఆలయాల నుంచి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మిగతా ఆలయాల నుంచి దరఖాస్తులు రాలేదు. చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామి, మఠంపల్లి మండలం స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తుమ్మడం కోటమైసమ్మ దేవాలయం, నల్లగొండ రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు ఇతర ఆలయాలకు పాలకవర్గం లేకపోవడంతో ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. ఆలయాల్లో ఉత్సవాల సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు మొదలు పూజాదికార్యాలకు ఇబ్బందులు పడుతున్నారు. పాలకవర్గం ఉంటే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయించే అవకాశం ఉంటుంది.

త్వరలో నోటిఫికేషన్ జారీ



ఉమ్మడి జిల్లాలో ఆలయాల్లో పాలకవర్గాల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ జారీ అవుతుంది. గతంలో 83 వరకు ఆలయాలకు పాలకవర్గాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశాం. అందులో 40 వరకు ఆలయాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు చేసుకోని ఆలయాలకు మళ్లీ నోటిఫికేషన్ ద్వారా పాలకవర్గాలు ఏర్పాటు జరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ ఈ మేరకు కసరత్తు చేస్తోంది.

– కె. భాస్కర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్